కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఓటర్లు 7లక్షలు

ప్రతిసారి పెరుగుతున్న ఓటర్ల సంఖ్య

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. తాజాగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలతో పాటు నిజాంపేట్ నగర కార్పొరేషన్, గ్రేటర్ పరిధిలోని కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఈనెల 20, 21వ తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మొత్తం 583 పోలింగ్ కేంద్రాల్లో పలువురు కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. గతంలో 6,99,130 మంది ఓటర్లుగా నమోదు కాగా తాజాగా తుది జాబితా విడుదల చేసే సమయానికి 7,06,729 చేరింది. వీరిలో పురుషులు 3,70,383 స్త్రీలు 3,36,186 ఇతరులు 160 మంది ఉన్నట్లు తేలింది.

ఆరు గ్యారంటీలు లబ్ధి చేకూరేలా కృషి



కొలన్ హన్మంతరెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డిను సత్కరిస్తున్న నాయకులు

నిజాంపేట్: ఆరు గ్యారంటీలను అర్హులకు లబ్ధి చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని 13, 14వ డివిజన్లలో ఆయన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి స్థానికంగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. త్వరితగతిన ప్రభుత్వ హామీలను అమలు చేసే దిశగా పని చేస్తామన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా



కృతజ్ఞత యాత్రలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న స్థానిక నాయకులు

కుత్బుల్లాపూర్: చిరస్థాయిగా నిలిచిపోయేలా ఘన విజయాన్ని అందించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కృతజ్ఞత యాత్రలో భాగంగా బుధవారం గాజులరామారం డివిజన్ పరిధి బాలయ్యనగర్, రావినారాయణరెడ్డినగర్, దేవేందర్‌నగర్, కట్టమైసమ్మ బస్తీ, పోచమ్మ బస్తీ, బండనవాజ్ బస్తీ, గాలిపోచమ్మ బస్తీ, నరసింహ బస్తీ, బతుకమ్మబండ, కైసర్‌నగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేస్తానన్నారు. అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగు పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, డివిజన్ అధ్యక్షుడు విజయరామ్‌రెడ్డి, పాక్స్ డైరెక్టర్ పరిషే శ్రీనివాస్‌యాదవ్, నాయకులు కస్తూరి బాల్‌రాజ్, కమలాకర్, రషీద్‌బేగ్, రావుల పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

◆ గౌడ శంఖారావం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ లక్ష్మారెడ్డి, గౌడ శంఖారావం చీఫ్ ఎడిటర్ అమరగాని శ్రీనివాస్‌గౌడ్, సబ్‌ఎడిటర్ సాయితరుణ్‌గౌడ్, నాయకులు డేగల కృష్ణమూర్తి, శ్రీహరిగౌడ్, కుత్బుల్లాపూర్ గౌడ సంఘం అధ్యక్షుడు బీసు వెంకటేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తారమ్మకు కుంకుమార్చన

భక్తులతో కిక్కిరిసిన చిత్తారమ్మ ఆలయ పరిసరాలు



ఫోన్‌లో ఫొటోలు దిగుతున్న వృద్ధులు

సుభాష్‌నగర్: గాజులరామారంలోని చిత్తారమ్మ దేవి జాతరలో భాగంగా బుధవారం జరిగిన కుంకుమార్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం నుంచి ఆలయ పరిసరాల్లో వెలిసిన దుకాణాల వద్ద భక్తులు కిక్కిరిసిపోతున్నారు. కానీ కొంతమంది పోకిరీలు గుంపులు గుంపులుగా తిరుగుతూ వెకిలి చేష్టలతో భక్తులకు తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తున్నారు. పోలీస్ అధికారులు దృష్టి సారించి పోకిరీలకు బుద్ధి చెప్పాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

◆ గాజులరామారం చిత్తారమ్మ దేవి జాతరలో భాగంగా తరలివచ్చిన యువత ఆలయ ఆవరణలో సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ తమ ఫోన్లో బంధిస్తున్నారు. అక్కడ ఉన్న మహిళా వృద్ధులు మేమేమి తక్కువేం కాదంటూ ఒకప్పటి బటన్ ఫోన్‌లో ఒకరినొకరు ఫొటోలు తీసుకున్నారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళ భక్తులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఏఈ వినాయక్‌రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. సుచిత్ర సిగ్నల్స్ సమీపంలోని షాపింగ్ మాల్స్ ఏరియా, జైన్ కన్‌స్ట్రక్షన్, పైపులైన్ రోడ్డు, ప్రాగాటూల్స్, బీహెచ్ఈఎల్ విస్టా, గ్రీన్ పార్కు, జీడిమెట్ల గ్రామం, గాయత్రినగర్, గోదావరి హోమ్స్, జేకే నగర్, జయరామ్‌నగర్, రుక్మిణి ఎస్టేట్స్, చర్మాస్ ఇండస్ట్రీస్ లేన్, వెన్నలగడ్డ, వెంకటేశ్వర ఎన్‌క్లేవ్, భజరంగ్ హిల్స్, దుర్గా ఎస్టేట్స్, రాఘవేంద్ర కాలనీ, వెంకటేశ్వర కాలనీ, బ్యాంక్ కాలనీ, ఎంఎన్‌రెడ్డి నగర్, వాజ్‌పేయినగర్, స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ, రామరాజు నగర్, మీనాక్షి ఎస్టేట్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

కొంపల్లి సెక్షన్ పరిధిలో..

దూలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ కేకే సొసైటీ, ప్రశాంతినగర్, ఐడీఏ-2, కార్తీకవనం, దూలపల్లి, స్టీల్ సిటీ, గంగాస్థాన్ ఫీడర్ల పరిధిలోని దూలపల్లి ఇండస్ట్రియల్ ఏరియా, హనుమాన్ వేబ్రిడ్జి, చౌదరి వేబ్రిడ్జి, హరియానా వేబ్రిడ్జి, డెక్కన్ కాంటా, అయ్యప్ప కాలనీ టెంపుల్ రోడ్డు, దూలపల్లి వీకర్ సెక్షన్, 120 గజాలు, అయ్యప్ప కాలనీ, గంగాస్థాన్, కార్తీకవనం, ఫారెస్ట్ అకాడమీ, ఐజాంట్ పరిశ్రమ, దూలపల్లి గ్రామం, అశోక-ఏలా-మైసన్ ఫేజ్-1, సెయింట్ మార్టిన్ ఇంజనీరింగ్ కళాశాల, స్టీల్ సిటీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని కొంపల్లి ఏఈ తెలిపారు.

ఆర్‌జీకే ఫీడర్ పరిధిలో..

నిజాంపేట్: ఆర్‌జీకే ఫీడర్ పరిధిలోని వాసవీ లేఅవుట్, విజయ డయాగ్నోస్టిక్స్, ప్రగతి సెంట్రల్ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 టల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రగతినగర్ ఏఈ తెలిపారు.

◆ బాచుపల్లి సెక్షన్ పరిధి వొల్వో ఫీడర్ పరిధిలోని సాయిఅనురాగ్ కాలనీ, కావ్య ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు. వికాస్ ఫీడర్ పరిధిలోని సాయికృష్ణ హిల్స్, వికాస్ స్కూల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ తెలిపారు.

◆ భండారి లేవుట్ ఫీడర్ పరిధిలోని భండారి లేఅవుట్ రోడ్డు నం. 1 నుంచి 10 వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు. రాజధాని స్కూల్ ఫీడర్ పరిధిలోని రెడ్డి ఎవెన్యూ, నిజాంపేట్ పాత గ్రామపంచాయతి కార్యాలయం సమీపంలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని నిజాంపేట్ సబ్‌స్టేషన్ ఏఈ పేర్కొన్నారు.

కబడ్డీ చాంపియన్‌షిప్ @ బాచుపల్లి

తొలిసారిగా జాతీయస్థాయి కబడ్డీ పోటీలు



బాచుపల్లిలో ప్రాక్టీస్ చేస్తున్న తెలంగాణ కబడ్డీ బాలుర జట్టు

- హర్షం వ్యక్తం చేస్తున్న బాచుపల్లి వాసులు
- ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు జూనియర్ కబడ్డీ పోటీలు
- 60 జట్లు పాల్గొననున్నట్లు వెల్లడి

నిజాంపేట్: తొలిసారిగా మేడ్చల్ జిల్లాలోని బాచుపల్లి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు వేదిక కానుంది. జూనియర్ నేషనల్ కబడ్డీ 2023-24 చాంపియన్‌షిప్ పోటీలు ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు జరుగనున్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కబడ్డీ అసోషియేషన్, తెలంగాణ కబడ్డీ అసోషియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో కాసాని కౌసల్య, కాసాని కృష్ణ ముదిరాజ్‌ల జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. అందుకోసం బాచుపల్లిలోని కబడ్డీ అకాడమీలో క్రీడాకారులు నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్నారు. తెలంగాణ కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏకేఎస్ఐ) ఉపాధ్యక్షుడు కాసాని వీరేశ్‌లు పోటీలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు

వివిధ రాష్ట్రాల నుంచి కబడ్డీ క్రీడాకారులు హాజరు కానున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రల నుంచి 30 బాలికలు, 30 బాలురు మొత్తం 60 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. తెలంగాణ కబడ్డీ క్రీడాకారులు కొద్ది రోజులుగా ఈ పోటీల్లో విజయం సాధించేందుకు బాచుపల్లిలోని అకాడమీలో శిక్షణ పొందుతూ మెలకువలు నేర్చుకుంటున్నారు.

మంచి ప్రదర్శన కనబరిస్తే అంతర్జాతీయ జట్టుకు...

ఈ పోటీల్లో మంచి నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను అంతర్జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపిక చేయనున్నారు.49 జూనియర్ నేషనల్ కబడ్డీ 2023-24 చాంపియన్‌షిప్ పోటీలకు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రముఖులు హాజరుకానున్నాట్లు సమాచారం. బాచుపల్లిలో ఈ పోటీలు జరుగనుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బాచుపల్లిలో ప్రాక్టీస్ చేస్తున్న తెలంగాణ కబడ్డీ బాలికల జట్టు

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే..



కబడ్డీపై ఆసక్తి ఉన్న గ్రామీణ, పట్టణ క్రీడకారులను ప్రోత్సహించేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నాం. పోటీలకు కావాల్సిన గ్రౌండ్ ప్రిపరేషన్ తదితర ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. కబడ్డీ పోటీలను చూసేందుకు వచ్చే వారికి సైతం ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులు, యువకులు ఈ పోటీలను తిలకించేందుకు రావచ్చు.

– జిల్లా కబడ్డీ అసోషియేషన్ సెక్రటరీ, ఏకేఎఫ్ఐ ఉపాధ్యక్షుడు కాసాని వీరేశ్

వైభవంగా మల్లికార్జునస్వామి జాతర



మల్లికార్జునస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: నర్సాపూర్ నియోజకవర్గంలోని గొల్లపల్లి గ్రామంలో జరిగిన మల్లికార్జునస్వామి జాతరలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీశైలంగౌడ్‌ను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

శుభాకాంక్షలు



పన్నాల హరీష్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సతీష్, దయాకర్

కుత్బుల్లాపూర్: మేడ్చల్ - మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పన్నాల హరీష్ రెడ్డిని బుధవారం బీజేవైఎం నాయకుడు ఒక్కంటి దయాకర్, చింతల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పత్తి సతీష్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని హరీష్‌రెడ్డి వారికి సూచించారు.

క్రాంతి ఆటో యూనియన్ నూతన కమిటీ

సుభాష్‌నగర్: ఏఐటీయూసీ అనుబంధ క్రాంతి ఆటో యూనియన్ నూతన కమిటీ సభ్యులు బుధవారం జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజకుమార్, ఎల్లస్వామి ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐను శాలువతో సత్కరించారు. అనంతరం సీఐ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు ఖచ్చింగా లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పైలటింగ్‌ను అనుమతించేది లేదన్నారు. ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శి హరినాథ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



కడారి పెరుమళ్లు (ఫైల్)

జగద్గిరిగుట్ట: బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ క్రాంతి కుమార్ వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట ఆర్‌పీ కాలనీకి చెందిన కడారి పెరుమళ్ల (58)కు కొంతకాలంగా ఆరోగ్యం బాగాలేదు. బుధవారం ఉదయం 7గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సదరు వ్యక్తి కుమారుడు కిరణ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఓటును అమ్ముకోవద్దు

జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీ

దుండిగల్: ఓటు వజ్రాయుధం లాంటిదని.. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని శ్రీ శ్లోక స్కూల్ డైరెక్టర్ కుకుడాల ఆంజనేయులు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పాఠశాల నుంచి గండిమైసమ్మ చౌరస్తా వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు గొప్పతనాన్ని.. ఓటును అమ్ముకోవద్దని విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమానికి గండిమైసమ్మ దుండిగల్ మండల తహశిల్దార్ సుచరిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

తప్పించుకు తిరుగుతున్న పాతనేరస్తుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: ఇళ్ల దోపిడీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్తుడిని పేట్ బషీరాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బుధవారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ ఏసీపీ, పేట్‌బషీరాబాద్ ఇన్‌చార్జ్‌ వెంకట్‌రెడ్డి నిందితుడి వివరాలు వెల్లడించారు. నగరంలోని ఫలక్‌నూమాకు చెందిన ఎలక్ట్రీషియన్ మహ్మద్ ఒమార్(56) సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో 2019లో అబిడ్స్ పోలీసులు ఒమార్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు.

◆ బెయిల్‌పై విడుదలపైన అతను తన పంథా మార్చుకోకుండా మరలా చోరీలకు పాల్పడుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఇతనిపై అబిడ్స్, బోయిన్‌పల్లి, ఫలక్‌నూమా, ఉప్పల్, ఉస్మానియా యూనివర్శిటీ, ఎల్బీనగర్, కూకట్‌పల్లి, కేబీహెచ్‌బీ, మియాపూర్ పీఎస్‌ల పరిధిలో కేసులు నమోదయ్యారు. ఇదే క్రమంలో ఈనెల 21న కుత్బుల్లాపూర్ పద్మానగర్ ఫేజ్-2లోని తాళం వేసి ఉన్న ఓ ఇంట్లోకి చొరబడి రూ. 7.50 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లాడు. దీనిపై కేసు నమోదు చేసిన పేట్‌బషీరాబాద్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఐ ప్రశాంత్, డీఐ రాజుల నేతృత్వంలో పోలీసు సిబ్బంది బుధవారం ఒమార్‌ను వలపన్ని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.6,97,500 విలువ చేసే సొత్తును రికవరీ చేసి రిమాండ్‌కు పంపారు.

పరీక్ష తప్పడంతో విద్యార్థిని ఆత్మహత్య



పూజిత (ఫైల్)

కుత్బుల్లాపూర్: పరీక్ష తప్పడంతో మనస్తాపానికి గురైన ఓ డిగ్రీ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లి సంజనా ఇంటర్ లేక్‌వ్యూలో నివాసముండే రామారావు కుమార్తె పూజిత (22) డిగ్రీ చదువుతోంది. కాగా ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఓ సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయ్యింది. మంగళవారం రామారావుపై పనిపై బయటకు వెళ్లగా ఇంట్లో కుమార్తె, అతని భార్య ఉమాదేవి ఉన్నారు. పరీక్ష తప్పిన బాధతో ఉన్న పూజిత బెడ్‌రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిని గమనించిన తల్లి ఉమాదేవి కుమార్తెను సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్కింగ్ చేసిన టిప్పర్ వెనుక పడుకుని అనంతలోకాలకు..

డ్రైవర్ టిప్పర్‌ను రివర్స్ తీయడంతో యువకుడు మృతి



మృతుడు శ్రీకాంత్

దుండిగల్: గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారం, కేసీఆర్‌కాలనీకి చెందిన శ్రీకాంత్(32) సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. కాగా బుధవారం మధ్యాహ్నం తాగిన మైకంలో ఖాజిపల్లి చౌరస్తా పక్కనే మట్టి రోడ్డులో పార్క్ చేసిన ఓ గుర్తు తెలియని టిప్పర్ వెనుక పడుకున్నాడు. ఇది గమనించని డ్రైవర్ అతడిపై నుంచి వాహనం తీసుకెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు శ్రీవర్ధన్ ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కంటైనర్ ఢీకొట్టడంతో మహిళ మృతి



మాలతి(ఫైల్)

దుండిగల్: రోడ్డు దాటుతున్న మహిళను కంటైనర్ ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులె తెలిపిన వివరాల ప్రకారం.. డి.పోచంపల్లి, సత్యశ్రీకాలనీకి చెందిన రామకృష్ణ, మాలతి ఆండాలు(56) భార్యాభర్తలు. మాలతి బుధవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో గండిమైసమ్మ సమీపంలోని బావర్చి హోటల్ వద్ద రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో బహదూర్‌పల్లి నుంచి గండిమైసమ్మ చౌరస్తా వైపు వస్తున్న కంటైనర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కంటైనర్ డ్రైవర్ పరారీలో ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'వికసిత భారత్ సంకల్ప యాత్ర'పై అవగాహన



బ్యాంకు రుణాలపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్, అధికారులు

కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బ్యాంకు రుణ పథకాలలో భాగంగా బుధవారం ''వికసిత్ భారత్ సంకల్ప యాత్ర''పేరిట కొంపల్లిలోని మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతికి వివిధ బ్యాంకుల నుంచి రుణాలు అందజేస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆధార్ సెంటర్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, మెప్మా డిపార్ట్‌మెంట్, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని షాపూర్‌నగర్‌లోని శారదా విద్యా భవన్ హైస్కూల్‌లో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ పారా లీగల్ వలంటీర్ మధుబాబు చికిలే ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఏడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ... బాలికలకు మనం ఇచ్చే ఆస్తి చదువు అని అన్నారు. చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవడమే కాకుండా సమాజంలో మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ మల్లేశ్వరి, రాఘవేందర్, లతాశ్రీ , శ్రావణి పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై ఎమ్మెల్సీకి ఫిర్యాదులు



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన వివిధ ప్రాంతాల ప్రజలు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. వాటిపై స్పందించిన రాజు సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లకు బహుమతులు



డ్రైవర్లకు బహుమతులు అందజేస్తున్న జీడిమెట్ల సీఐ శ్రీనివాస్

జీడిమెట్ల: ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని జీడిమెట్ల సీఐ శ్రీనివాస్ అన్నారు. డ్రైవర్స్ డేను పురస్కరించుకుని బుధవారం జీడిమెట్ల బస్ డిపోలో జరిగిన కార్యక్రమానికి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న పలువురు డ్రైవర్లకు డీఎం విజయ్‌కుమార్‌తో కలిసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ... మొబైల్ ఫోన్లలో మాట్లాడకుండా డ్రైవింగ్ చేయాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అనుసరిస్తూ రూల్స్ పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటిక, కమ్యూనిటీహాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలి



డిప్యూటీ మేయర్‌ను కలిసిన నిజాంపేట్ పాస్టర్ ప్రేయర్ ఫెలోషిప్ అసోసియేషన్ సభ్యులు

నిజాంపేట్: నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌ను మంగళవారం నిజాంపేట్ పాస్టర్ ప్రేయర్ ఫెలోషిప్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. క్రైస్తవుల శ్మశానవాటిక, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జగదేక కుమార్, జనరల్ సెక్రటరీ జాషువా, కోశాధికారి ఆనంద్ కుమార్, బ్రదర్ జాషువా, ఈఎం చారి, నెహెమ్యా, యెహోషువ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



(నాడు)

రంగారెడ్డినగర్: అధ్వానంగా మారిన రోడ్ల దుస్థితిపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి సర్కిల్ అధికారులు స్పందించారు. కుత్బుల్లాపూర్ డివిజన్ సూర్యానగర్‌లోని యూనిక్ హైస్కూల్ రోడ్డు దుమ్ము, ధూళితో మట్టి రోడ్డును తలపించడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందుల విషయమై 'సాక్షి'లో కథనంతో రావడంతో సర్కిల్ అధికారులు రెండు రోజుల క్రితం సీసీ రోడ్డును నిర్మించారు. దీంతో ఎన్నో ఏళ్లుగా తాము పడుతున్న రోడ్డు ఇబ్బందులు తీరడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేసి 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.



సూర్యానగర్ యూనిక్ హైస్కూల్ దారిలో వేసిన సీసీ రోడ్డు